## ఇంద్రగంటి జానకీబాల

ఎకౌంటెంట్ గారితో మాట్లాడు తున్న సారధి దగ్గరకెళ్ళి సుబ్రహ్మణ్యం.

"ఇందులో ఓ సంతకం పడేయండి ఫ్లీజ్ మీ టేబులుమీద ఉంచి గానీ" అన్నాడు.

నిజానికి రికార్డు క్లర్కు సుబ్రహ్మణ్యం చెప్పింది పూర్తిగా వినిపించుకోక పోయినా, ఓ సంతకం గిలికి మళ్ళీ తీవ్రచర్చలలో మునిగిపోయాడు సారధి.

విషయం సీరియస్‌గా ఉంది. ఒక్కొక్క క్లర్కు మూడువందలు నేమ్సు ఆడిట్ చెయ్యాలా, మూడువందల యాభై చెయ్యాలా ? ఎన్ని చేస్తే ఆడిట్ క్వాలిటీ ఉంటుంది ? అసలు ఎన్ని నేమ్సు ఆడిట్ ఖచ్చితంగా చెయ్యగలడో గుమస్తా? ఇంతవరకు ఈ బిల్ ఆడిట్‌కి నారమ్స్ ఎందుకు నిర్ణయించలేదు? గుమస్తాలంటే గొడ్డుచాకిరీ చెయ్యాలా? ఏమైనా తప్పు లొప్పులు వస్తే అంతాహాయిగా తప్పు కుంటారు. చిరుద్యోగులమైన మామీద పెడతారు అంటూ వాదోపవాదాలు, ఆర్గ్యుమెంట్‌లు, అభియోగాలు జరుగు తున్నాయి ఎకౌంటెంట్ గారి సీటుదగ్గర నిజంగా అది గుమస్తాలకీ, సూపర్‌వైజర్ లకి మధ్య జరుగుతున్న మర్యాదైన యుద్ధం.

పనితనంలో నేర్పు సంపాదించడం వల్ల గానీ, తెలివితేటల వల్లగానీ ఎవ్వరికీ ప్రమోషన్లురావు. తమకిందవారు కాలుకీ, మెడకీ బందాలువేస్తూ మొరాయిస్తూ, మొండికేస్తే, వాళ్ళకి లొంగకుండాతనూ అంతకి రెండింతలు ముళ్ళువెయ్యగల శక్తిని సంపాదించుకుంటే అదే ప్రమోషన్‌కి అర్హత.

అందుకే ఎకౌంటెంట్‌గారు ఖచ్చితంగా చెప్పారు. "ప్రతి గుమస్తా మూడొందల యాభై నేమ్సు ఆడిట్ చేసి, ఇరవైతొమ్మిదో తారీఖునాటికి నా టేబులు మీద పెట్టాల్సిందే" అని—

విసుగ్గా వచ్చి తనసీట్లోకూర్చున్నాడు సారధి, ప్రసాదు నెమ్మదిగా వచ్చి "సారూ, మీరు హీటెక్కి పోయినట్లున్నారు. ఈ అందమైన బొమ్మచూడండి హాయిగా ఉంటుంది" అంటూనే ఆఫీస్ బోయ్ కావడంవల్ల బెల్లు వినిపించిన వైపు పరుగు పెట్టాడు. నిజంగా ఆ బొమ్మకేసి చూడంగానే మండుటెండ లోంచి ఏ.సి. రూంలోకి వచ్చినట్లని పించింది సారధికి. మధ్యకి మడచిన న్యూస్‌పేపర్ మీద నిలువెత్తున నిలబడిన

# అట్టహాసం






అందాలతార శ్రీదేవి బొమ్మ అది. ఎంత అందంగా వయ్యారంగా ఉందనీ అది. చిన్న నిక్కరు, బనీను వేసుకొని ఎత్తె మడమల జోళ్ళు, చేతిలో రంగుల పువ్వుల గొడుగు,—కళ్ళలో చిలిపితనం, కవ్వించే ఆడతనం, కనురెప్పలు వేయనీయని కమనీయమైన చివురుటాకుల్లాంటి చిరు పెదవులు.... సారధి ఆదమరచి చూస్తూనే ఉన్నాడు. మూర్తీభవించిన సౌందర్య దేవత అని పదే పదే అనుకుంటున్నాడు. తదేకంగా చూస్తూన్నాడు. అంతా ఎవరి హడావుడిలో వారున్నారు. ఎవరూ తనని పట్టించుకోకపోయినా అతనికి తనివి తీరలేదు. ఆబొమ్మవంక ఇంకా ఎంత సేపైనా చూస్తూ ఉండాలనే ఉంది. అయిష్టంగా ఆపేపరు తీసి డ్రాయరు సొరుగులలో వేసి అన్యమనస్కంగా పని మొదలు పెట్టాడు....

మూడురోజులు ముమ్మరంగా జరిగే సేలరీబిల్ ఆడిట్ సారధి ఈసారి కసిగా చేశాడు. ఎల్.పి.సి. రాలేదని కొందరి జీతాలు కోశాడు. మస్తరులో తప్పులున్నాయని కత్తిరింపులు చేసాడు. ఆఫీసర్ల సంతకాలు అన్నిచోట్లా లేవనీ- అవనీ ఇవనీ ఉపకాగితాల అబ్జక్షన్ల రిపోర్టు తయారుచేశాడు. అది ఆఖరి రోజు. వచ్చిన బిల్లులన్నీ లెక్కచూసి పంపాల్సినరోజు. సారధి చేస్తున్న డిపో మేనేజర్‌గారి బిల్లు ఎక్కడా కనిపించ లేదు. కనపడుట లేదనే వార్త దావనం లాగా ఆఫీసంతా వ్యాపించింది-ఫ్యాన్లు, వెతకటం మొదలు పెట్టారు. కొంత మంది గుమస్తాలు కూడా సానుభూతితో తమ సీట్లు వెదికి వారిదగ్గర లేదని ఖాయం చేశారు.

సారధికి వొళ్ళు మండిపోయింది. అన్ని బిల్సుతో కలిసినాకా బిల్లురాలేదని ఢంకా మీద దెబ్బకొట్టి చెప్పాడు- ఎకౌంటెంట్ గారు "వెదకండి వెదకండి అంటూ....బంగారు మామిడిపండు కోసం మహారాజుగారు తన పరివారాన్ని నాలుగు వైపులకీ పంపినట్లు, అందర్నీ ఆదేశించారు. చివరిగా సారధి అసలు నాకా బిల్లు డాక్‌లోంచి రాలేదన్నాడు. అన్న అరక్షణంలో సుబ్రహ్మణ్యంగారు డాక్ రిజిష్టర్ తెచ్చి సారధి సంతకం చూపించారు. సారధికేం చెయ్యాలో పాలుపోలేదు, బిల్లు తీసుకుని పోగొట్టి






నందుకు—ముందు మెమో, తర్వాత చార్జిషీటు — అలా — అలా ఏమైనా జరగచ్చు. మానసంతా చికాకుగా అయిపోయింది. అంతదెబ్బలాడిన ఎకౌంటెంట్ గారి దగ్గరకెళ్ళి "సార్, ఓసారి డిపోకి ఫోను చేస్తాను" అన్నాడు.

ఆయన అవకాశాన్ని జారవిడుచుకోకుండా "ఏమయ్యా ! జాగ్రత్తఉండాలి నువ్వు తీసుకున్నావు. మరెక్కడ పెట్టావు? డిపోకి ఫోను చేసి ఏం చెప్తావు ? " అన్నారు.

"డూప్లికేట్ పంపమనిచెప్తానుసార్" అన్నాడు. తలొంచుకొని. సారధిలాంటి చాకులాంటి కుర్రాడలా ఓడిపోవడం ఎకౌంటెంట్‌కి కూడా ఏమి బాగాలేదు. "సరే కానీయండి" అన్నారు మిట్ట మధ్యాహ్నం ఎండతో చెమటలు కక్కుతూ డిపో గుమస్తా పరుగెట్టుకొచ్చాడు. "ఏంటి గురూ ! మా డి.ఎమ్. ఛండ శాసనుడు డూప్లికేటుమీద సంతకమంటే నానా గొడవనూ— అయినా ఎలా పోయింది గురూ" అన్నాడు ఆయా సంగా—సారధి ముఖం నల్లగా మాడిపోయింది.

"ఆయనే ఉంటే అరటాకెందుకని సామెత ఎలాపోయిందో తెలిస్తే బాధేముంది" అన్నాడు,

అదేంటి గురూ ! నిలువెత్తున నిలబడిన శ్రీదేవి బొమ్మున్న పేపరు అట్ట వేశాను గురూ." అన్నాడు. సారధి ఉలిక్కి పడ్డాడు. చటుక్కున డ్రాయరు సొరుగు లాగాడు. సిరులొలికే కళ్ళతో చిలిపిగా నవ్వుతున్న శ్రీదేవి— బయటికి తీసిచూశాడు. లోపల ఒక్క పేజీ బిల్లు. డి.ఎమ్. గారి ఒక్కరికోసం ప్రత్యేకంగా వేసిన బిల్లు. అటూ ఇటూ దట్టమైన రెండేసికాగితాల అట్టలు. ఈ మూడురోజుల్లో ఆబొమ్మని కనీసం మూడొందలసార్లు చూశాడు తను.

ఆ బొమ్మను వెనక్కి మడిచి లోపలి డి.ఎమ్. గారి బిల్లు ఆడిట్ చేస్తుంటే సారధికో దుఃఖంలోంచి నవ్వు వికటాట్టహాసం చేసింది.

*